# వృత్తి ధర్మం

మేఘాలతో చిక్కబడి ఆకాశం నల్లగా ఉంది సన్నగా వర్షపు తుంపరలు పడుతున్నాయి. ఉండుండి మెరిసే మెరుపులకు ఆ రోడ్డు ఆహారం కోసం పొంచి ఉన్న త్రాచుపాములా వంకర టింకరగా కని పిస్తోంది. రోడ్డు అంచున వర్షం పడకుండా తలపై చేతులు పెట్టుకొని అటూ ఇటూ చూస్తున్న మీరమ్మ ఒయ్యారంగా ఉంది.

ఊరికి సరిగ్గా మైలు దూరంగా ఉన్న ప్రదేశమది. అక్కడ ఐదు అంకణాల పొడవున్న ఒకే ఒక వసారా ఉంది. అది యానాదమ్మ వేశ్యల కంపెనీ ఆ బారు వసారా మధ్య నాలుగు తడికెలు కట్టి ఐదు రూము లుగా విభజించబడి ఉంది. ఆ వసారాకు ముందు తాటాకులతో పంచ ఉంది.

ఆ ఐదు రూముల్లో ఒకటి యానాదమ్మ ఆఫీసుగది ప్లస్ రెసి డెన్సు. మిగతా నాలుగు రూముల్లో నలుగురు వేశ్యలున్నారు.

అది రాత్రి పన్నెండు గంటల సమయం. కంపెనీలోని చిలకలు సరోజ, రాధ, గీతారాణి పట్నం నుంచి తెప్పించుకున్న పూలతో సింగా రించుకొని చాపమీద కూర్చొని మాట్లాడు కొంటున్నారు. యానాదమ్మ తన రూము ముందు పీట వేసుకొని కూర్చొని వుంది. చుట్టముక్కను కొద్దిగా తుంచి నోట్లో వేసుకొని నములుతూ అందులోని మాధుర్యాన్ని ఆనందంగా అనుభవిస్తోంది.

ఐతే నాలుగో రూములో ఉన్న మీరమ్మ పరిస్థితి వేరు. అందరిలా సంతోషంగా ఆమె ఉండలేకుంది. కారణం ఆమె ఉదయం నుంచి ఎదురు చూస్తున్నా తన కోటా డ్యూటీ చేయలేకుండా ఉంది.

ఆ కంపెనీలో ప్రస్తుతమున్న నలుగురిలో మీరమ్మ వెనకబడి ఉంది అన్ని విషయాల్లో. శరీర సౌష్టవం బాగున్నా పాపం మీరమ్మకు మెల్లకన్ను. మిగతావాళ్ళు తెల్లగా, వయసు తక్కువగా కనిపిస్తారు. వచ్చిన పాసింజర్లంతా మిగతా ముగ్గురు దగ్గరకు పోతున్నారు. ఆలస్యం అయినా వాళ్ళకోసమే ఎదురు చూస్తారు. అట్లని మీరమ్మకు బుకింగులు లేవనికాదు. ఆమె శరీర సౌష్టవాన్ని మెచ్చివచ్చే పాసింజర్లూ ఉన్నారు.

మీరమ్మకు ఒకటే దిగులుగా ఉంది. మూడురోజుల్నుంచి ఆమెకు మరీ కేసులు తగ్గిపోతున్నాయి. అందుకే ఈ రోజు ఉదయం నుండి ఆ మూడురోజుల కోటాను ఎలాగయినా భర్తీ చేయాలనే ఉద్దేశంతో ఉంది. ఐతే ఉదయం నుంచి ఇప్పటివరకు అతి కష్టంమీద, పదిమంది పాసింజర్లు మాత్రమే వచ్చారు.

మీరమ్మ రోడ్డుమీదే నిలబడి ఉంది. వర్షం పడకుండా చేతులు ఎంత అడ్డు పెట్టుకొన్నా తడుస్తూనే ఉంది. ఊరు మైలు దూరంలోనే ఉండడంవల్ల అక్కడే ఆగి టీ త్రాగి నేరుగా ఆగకుండా వెళ్ళిపోతున్నాయి లారీలు. ఐనా మీరమ్మ ఆ వర్షంలోనే ఎదురు చూస్తూ ఉంది.

"ఒసేయ్ మీరమ్మా! ఇరాశపడితే నీ మొగంచూసే వాళ్ళుండరు. నామాటిని వచ్చి పంచలో కూసో" అంది కంపెనీ ప్రొప్రయిటరు యానాదమ్మ సానుభూతిగా.

మీరమ్మ పలకలేదు.

"వచ్చే కేసులన్నీ నువ్వే చూసుకుందువులే. ఆళ్ళంతా నిదరపోతుండరు" ఐనా మీరమ్మ జవాబు చెప్పలేదు.

"నే సెప్పాల్సింది సెప్పినా, తర్వాత నీ ఇట్టం."

అంటూ తడికె తలుపు వేసుకొని లోపల పడుకొంది యానాదమ్మ.

అప్పటికే రాత్రి ఒంటిగంటయింది. అందరూ ఎవరి గదుల్లో వాళ్ళు తడికె తలుపు వేసుకొని పడుకొన్నారు. టీ కుర్రాడు గడేళం పంచలో ముడుచుకుని కుక్కపిల్లలా పడుకొన్నాడు.

మీరమ్మ వయసు ముప్పై అయిదేళ్ళే అయినా శరీరానికి ఇరవై ఏళ్ళ కంపెనీ సర్వీసుంటది. మీరమ్మ ఎనిమిదో క్లాసుచదువుతూ వేమయ్య అనేవాడి వలలో పడి వాడితో లేచిపోయింది వాడు కూడుపెట్టి గుడ్డిస్తే అంతే చాలనుకొంది. పదిమంది సంతానంలో బీదరికం అనుభవిస్తున్న మీరమ్మ.

వాడు తనతో కొంతమందిని తీసుకొచ్చి మీరమ్మ దగ్గరకు పంపే వాడు. మీరమ్మ ఒప్పుకొనేది. కారణం వేమయ్య చెప్పాడు కాబట్టి. వాడి మాటే వేదం. అలా కొంతకాలం డబ్బు సంపాదించి పోషించింది. కాని వాడు పెద్ద మొత్తం అవసరమై మీరమ్మను పదిహేను వందలకు కంపె నీకి అమ్మేసాడు. అయినా మీరమ్మ బాధపడనూలేదు, సంతోషించనూలేదు.

మీరమ్మది ఒకటే సిద్ధాంతం. మాటంటే మాటే. పనంటే పనే. అదెలాంటి పనయినా సరే. తన వృత్తిధర్మం తాను నెరవేర్చాలి. తన కర్తవ్యంలో ఎలాంటి లోపం ఉండకూడదు. ఇతర ఆలోచనలకు చోటి వ్వదు. అందుకే కంపెనీ ప్రొప్రయిటర్లకు మీరమ్మ అంటే ఇష్టం. మిగతా వాళ్ళలా కాకుండా ఏ ఇతర పని చెప్పినా కాదనకుండా చేస్తుంది.

సన్నగా పడే వర్షం ఆగి పోయింది. దూరంగా మినుకు మినుకు మంటూ ఒక లారీ వస్తోంది. మీరమ్మలో నూతనోత్సాహం పెల్లుబికింది. ఆశగా చూసింది.

ఆ లారీ జర్రున వచ్చి రోడ్డుమీద నీళ్ళను చిమ్ముతూ వెళ్ళి పోయింది. నీళ్ళు పైన పడకుండా దూరంగా పరుగెత్తింది మీరమ్మ. ఆ

వెనుక ఇంకా లారీలు వస్తున్నాయి. ఐనా ఏం లాభం ఒక్క లారీ ఆగడం లేదు. ఒక్కో లారీ రావడం మీరమ్మలో ఆశను రేపడం వెళ్ళిపోవడం.

కొంతసేపటికి రోడ్డు మళ్ళీ చీకటితో నిండిపోయింది. మీరమ్మలో ఆశ చావడంలేదు. బాధ్యత గుర్తుకొస్తుంది. దాంతోబాటు పట్టుదల కూడా ఎక్కువవుతూ ఉంది. ఎలాగయినా ఈ రోజు రాత్రంతా జాగరణచేసి మిగిలిపోయిన కేసులు పూర్తి చేయాలి. అదే ఆమె దీక్ష

మీరమ్మకు దూరంగా లైట్లు కనిపించాయి. అప్పటికే రాత్రి ఒంటి గంటయింది. ఈ లారీని ఎలాగయినా ఆపాలనుకొంది. అందుకే రోడ్డు మీద అడ్డంగా నిలబడింది. అలా నిలబడితే తప్పక లారీ ఆగుతుంది. తర్వాత వాళ్ళను కాళ్ళావేళ్ళాపడి అయినా ఒప్పించుకోవచ్చు.

లారీ దగ్గరయ్యేకొద్దీ మీరమ్మ గుండె దడదడ లాడ సాగింది. లారీ ఆపకపోతే!... ఆ విధంగా అనుకోవడమే ఆమెకు భయంగా ఉంది. వచ్చేసింది అనుకున్న లారీ మీరమ్మున్న చోటుకి అరఫర్లాంగుదూరంలో కీచుమంటూ ఆగిపోయింది కొద్దిసేపటికి తర్వాత క్లీనరు హెచ్చరుసుక్క అంటిస్తే డ్రయివర్ ఇంజనుక్రింద పడుకొన్నాడు. లారీలోంచి దిగిన వాళ్ళు కొంతమంది డ్రైవరుకు వచ్చే వెలుతురుకు అడ్డు లేకుండా మిగతా వసారా వైపులా కూర్చొన్నారు.

మీరమ్మ ఆశ అంతా ఇంతా కాదు పంచపాండవుల్లా ఐదుగు రున్నారు. ఈ ఐదుగురులో ఎవరో ఒకరు తన దగ్గరకు రాకపోరు. ఒకరేమిటి! ఐదుగురూ తనకు కావాలి అనుకొంది.

మీరమ్మ పరుగులాటి నడకతో వసారాలోకి పరుగెత్తింది. తన సంచిలోనుంచి చీరకోసం వెతికింది. ఎర్రపూలచీర బయటకి తీసింది. అదయితే తన శరీరం రంగుకు నప్పుతుంది. ఎర్రరంగు జాకెట్ వేసు

కొంది. తన తలలోని పూలు చాలక ప్రక్కగది తడికకొట్టి లంగా, బ్రా మాత్రమే శరీరంమీద ఉంచుకొని నిద్రిస్తున్న సుధారాణి తలలోని పూలు కూడా లాక్కొని తన తలలో తురుముకొంది. ఇప్పుడామె తలనిండా మల్లెపూలు పెట్టుకొని శోభనం గదిలోకి నడిచే పెళ్ళికూతురిలా ఉంది.

పొడవైన జడ వీపుమీద నాట్యం చేస్తుండగా, మల్లెలు పరిమళాన్ని వెదజల్లుతూంటే మీరమ్మ ఆశగా, ఆత్రంగా లారీవైపు నడవసాగింది.

బైరు ముక్క వెలుతురులో లారీ ఇంజను క్రింద పట్ట వేసుకొని వెల్లకిలా పడుకొని స్పానరు స్క్రూడ్రైవర్‌తో ఏదో బిగిస్తున్నాడు డ్రైవర్. మంటకు మిగతా మూడు వైపులా కూర్చొని ఉన్నారు మరో నలుగురు. వాళ్ళలో క్లీనరు డ్రైవరుకు అడిగిన వస్తువులు అందిస్తు న్నాడు.

అందరూ ఒక్కసారి ఉలిక్కిపడి చూశారు. మనిషి నలుపయినా అద్భుతమైన శరీర సౌష్టవంతో ఫుల్ మేకప్‌తో ఉన్న మీరమ్మ ఆ సమ యంలో అందరి మనసులను చెడగొడుతూ ఉంది మీరమ్మ హుందాగా నడిచి వచ్చి నవ్వుతూ మంటముందు కూర్చొంది.

"ఎ...ఎవరు కావాలి" గొంతు పిడచకట్టుకు పోగా తడబడుతూ అన్నాడు క్లీనరు. వాడు క్రొత్తవాడు. నిన్ననే ఉద్యోగంలో చేరాడు.

"మామకోసం వచ్చినా" చేతులు ముందుకుచాచి అరచేతులు మంటవైపు చూపిస్తూ అంది మీరమ్మ.

చేస్తున్న పని ఆపి మల్లెల వాసన వచ్చిన దిక్కుకు తల నిక్క బెట్టి చూస్తున్న డ్రయివర్ "దీని మావ ఎవడు! అసలిది ఏడనుంచి వచ్చింది" అనుకొన్నాడు.

"ఎవరు నీ మామ"

"ఆడే దయివరు మామ సుక్కల్లో సెందురుడు"

గర్వంగా చూసాడు డ్రయివరు మీసాలు మెలేసుకున్నాడు.

"ఏ దయివరు"

క్లీనరు మాటలకు కిలకిలా నవ్వింది మీరమ్మ. "ఎర్రోడా ఈ లారీ డ్రయివరే మొగాడు. మొనగాడు, మగధీరుడు. ఇంకా మాట్లాడితే నా మొగుడు కూడా."

ఘాటైన ఆ మాటకు కొత్తవాడు, కుర్రవాడయిన ఆ క్లీనరు తట్టుకోలేక పోయాడు.

"అవున్రా అది నీ అమ్మగారు. లోపలికెక్కించు" గర్వంగా అన్నాడు డ్రయివరు.

"సిత్తం. అమ్మగారా! ఏ అమ్మగారు ఈ డెందుకుంది"

"ఒరే. నువ్వు మళ్ళీ మాట్లాడబాకరో. ముందు లోపలికెక్కించు" డ్రయివర్ అరిచాడు.

"చూసినా మామ తడాకా. పౌరుసమంటే అట్టుండాల"

"అట్టాగే ఎక్కిత్తా" అంటూ కాబిను తలుపు తీసాడు. కాబినులో చలికి ముడగ తీసుకొని కూర్చొన్న మరో ముగ్గురు ఆ వైపు దోవ తీసుకొని ఒదిగిపోయారు. అయిదుగురు గాక ఇంకో ముగ్గురు అంటే ఎనిమిది మంది. అంటే శలభైరూపాయలు మంచిమీద తను మరో పదిరూపాయలు సంపాయించుకోవచ్చు. అనుకొంది మీరమ్మ.

"అరే క్లీనరు కుర్రోడు నేనెక్కాల్సింది కాబిన్‌లోకాదు. బాడీ మీద నువ్వు పైకెక్కి నన్ను లాక్కో"

మీరమ్మ ఆజ్ఞను పురస్కరించుకొని హాఫ్‌బాడీ లోడయి వున్న లారీ ఎక్కి ఆమెను పైకి లాగాడు. ఆమె కాబిను కానుకొని నిలబడి వాడ్ని గట్టిగా కౌగలించుకుంది.

"అమ్మగారో. ఇదేందిది. నన్నొదలండి"

"అదేందో అయ్యగార్నడుగు తెలస్తది"

"నన్నొదులు అమ్మగారో. మా డ్రయివరు అయ్యగారికి తెలిస్తే సంపేత్తడు."

"నానేం అయ్యగారి సొత్తుకాదు. పెజలసొత్తును. పెజల మడిసిని."

ఉపన్యాసం వాడిచెవుల్లో ఊదింది.

వాడు ఆమె భుజాలు పట్టుకొని నెడుతూ గింజుకొన్నాడు.

"ఛ. పోరా పిరికి నాయాలా? ఇట్టుంటే ఏ ముద్దోగం సేత్తవురా" అంటూ వాడ్ని నెట్టింది.

క్లీనరు బ్రతుకుజీవుడా అనుకొంటూ క్రిందికి దిగాడు.

మీరమ్మ లారీమీద కప్పిన టార్పాలిను పట్టమీద ఒకచోట నిలచిన నీళ్ళు చేతితో తీసుకొని మంటచుట్టూ కూర్చొన్న వాళ్ళమీద చల్లింది.

వాళ్ళు ఎవరికి వాళ్ళే ఉలిక్కిపడ్డారు. కిలకిలా నవ్వింది మీరమ్మ.

"ఏటే పిల్లా మహా సరసాలాడుతున్నావ్ నేనొత్తుండా ఉండు. నీ పొగరణగ తీత్తా" కోపంచూపిస్తూ అన్నాడు డ్రయివరు.

"ఆ మా వత్తుండవ్. వచ్చి అరగంటయినా" రాగాలుతీస్తూ గారాలు పోయింది మీరమ్మ.

డ్రయివరు ఇంజను క్రిందనుంచి బయటకువచ్చి క్లీనరు అందించిన పాతగుడ్డతో చేతులకంటిన ఆయిలు మరకలు తుడుచుకొన్నాడు.

తరువాత వళ్ళు విరుచుకొని లారీ పైకెక్కాడు.

లారీపైన టార్పాలిన్ పట్టబాగా తడిసి వుంది.

కాబిను కానుకొని నిలబడి ఉన్న మీరమ్మ ప్రక్కనే ఆనుకొని నిలబడ్డాడు.

"ఏటే మీరమ్మా. ఏటన్నావు ఇందాక"

"అదే మోటు సరసగాడివి దొరికావని"

"ఏంది నేను మోటు సరసగాడ్నంటావా"

మీరమ్మను కౌగలిలో బంధించాడు డ్రయివరు.

"ఇడు ఇడు ముందు బేరం మాట్లాడు. ఆనక అది"

"బేరమేంది. రెండు రూపాయలే కదా మనిషికి"

"ఏందిరా మావా! ఏడుండవు నువ్వు ఇండియాలోనా లేక ఇంగ్లండులోనా బియ్యం ఎట్టమ్ముతుందయిప్పుడు."

"కిలో నాల్రూపాయలు"

"ఆఁ మరి...కిలో రెండ్రూపాయలు అమ్మినప్పుడు ధర అది. ఇప్పుడు నారేటు ఐదు మరి"

"ఒసే. ఇంతేగదా! పదిరూపాయలను కొన్నాను"

"అసలు నా రేటు పదే. అరడజను మందుండరు గదాని కన్నేసను ఐదు రూపాయల కొప్పుకొన్నా."

"అట్టాగేలెయ్! తొందరగా కానీ. కింద సలిగా ఉంటాది"

"మావా! ఐక్ళీసు నాకు రూపాయియ్యాల అందరిసేత గూడా రూపాయి లెక్కన ఇప్పించాల" మురిపెంగా అడిగింది.

"అబ్బ! అట్టాగేలెయ్ నీ యబ్బ. ఇంక మాట్లాడొద్దు"

మీరమ్మ అతను చెప్పినట్లు మళ్ళీ మాట్లాడలేదు. అతనూ ఆమెను మాట్లాడనీయలేదు. మీరమ్మ శిప్పుడు ఆనందంగా ఉంది. తన వృత్తి ధర్మం తాను సక్రమంగా నిర్వహిస్తోంది. ఈ విషయం తెలిసి తన ప్రొప్రయిటరు ఎంతో ఆనందిస్తోంది. తను అందరిలో ఎక్కువ గౌర వంతో తలెత్తుకు తిరుగుతుంది.

ఒకరి తర్వాత ఒకరుగా డ్రయివరు తర్వాత పాసింజర్లు ఐదుగురూ మీరమ్మ శరీరాన్ని పంచుకొన్నారు. మీరమ్మ డబ్బులు కోసం దిగబో తుండగా మళ్ళీ డ్రయివరు పైకెక్కి ఆమెను అటకాయించాడు. మళ్ళీ ఒకరి తర్వాత ఒకరు మీరమ్మ దగ్గరకు పోసాగారు.

పైన కురిసిన భారీ వర్షాల వలన లారీ ఉన్న చోటుకు కొద్ది దూరంలో రోడ్డుకు అటువైపు, ఇటువైపు పల్లంగా ఉన్నచోట్ల నీళ్ళు ప్రవ హించడంతో వాహనాలు రావడంలేదు.

క్షణ క్షణానికి మీరమ్మ శరీరం తేలిపోసాగింది. ప్రాణం పోతున్న ట్లుగా ఉంది. ఎవరో ఎంతో చేతిలో పెట్టి పోతున్నారు.

క్రింద కూర్చుని ఉన్న క్లీనరు కుర్రాడు జరిగే పరిస్థితి చూస్తూ గడ గడా వణికిపోతున్నాడు. అమ్మగారు అని చెప్పిన డ్రైవర్ తనే కాకుండా ప్రక్కనున్న ఆరుగురు మనుషుల్ని తీసుకుపోయాడు.

మొదట్లో సరసాలాడిన మీరమ్మ పరిస్థితిని, ఇప్పుడు ఏడుస్తున్న మీరమ్మను తలచుకొనే కొందీ దుఃఖం రాసాగింది. అరచేతిలో ప్రాణం

పెట్టుకుని ఏమీ చేయలేక, ఏంచేయాలో తెలియక భయపడుతూ కూర్చుని వున్నాడు.

"ద... దయివరు మావా దాహం..." అంది మీరమ్మ నీరసంగా లేచే శక్తిలేక. ఆమె అర్ధనగ్నంగా పడి వుంది.

అప్పటికే అందరూ క్రిందికి దిగి లారీ ఎప్పుడు బయల్దేరుతుందా అని ఎదురు చూస్తున్నారు.

వెటకరంగా నవ్వాడు డ్రయివర్.

"ఒరే క్లీనరూ, ఇట్రారా దీన్నందుకో" పైన్నుంచి అరిచాడు డ్రయివర్.

క్లీనరు లారీ ప్రక్కకు వచ్చాడు. డ్రయివరు మీరమ్మ ఒంటిమీద చీర చుట్టి, ఆమె చేతులు పట్టుకుని శరీరాన్ని లారీ ప్రక్కగా నెమ్మదిగా క్రిందికి జార్చాడు.

క్రింద వున్న క్లీనరు భయం భయంగా ఆమెవేపు చూసాడు. ఆమె శరీరం మీద చీర అర్ధనగ్నంగా చుట్టబడి వుంది. గుండెల కింద అచ్ఛాదన లేదు.

"ఏందిరా ఎర్రి నాయాలా. అట్టా సూత్తావు. అందుకో మడిసిని"

క్లీనరు ఆమెను ఎత్తుకొని భుజాన పడుకోబెట్టుకున్నాడు. వాడికి దిగులుగా ఉంది. ఆమె చల్లగా, గుండెలు మెల్లగా తగులుతున్నాయి. అంతకు పూర్వం సరసాలాడి అందరినీ కవ్వించిన మీరమ్మ ఇప్పుడు తొడిమ తెంపి నేలరాచిన పూవులా వుంది.

నిన్న ఉదయం అమ్మ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి వాడికి. "ఒరే నాయనా, పాసిపని చేసి, కూలిపని చేసి, నాలిచేసి నిన్ను ఎనిమిది

సదివిచ్చినా. అంతకు శక్తిలే. హోటల్లో పనిచేత్తా ఎట్టగానో బతుకు తుండవు. ఇపుడాడెవడో డయివరు రమ్మన్నదని క్లీనరుగా ఎల్తనంటుండవు అంతా దేవుడి దయ. యాడుండినా నీ పని ధర్మంగా సెయ్. నాయంగా పో. పది రూపాయలు సంపాదిత్తే నీకంటే బీదోడికి ఒక రూపాయ ఇయ్యి. డయివరు సెప్పినట్టు ఇను నాయనా. బయట ఇసయాలు తెలియనిదాన్ని అంతా ఏడుకొండలోడి దయ"

వాడు ఆలోచనల్లోంచి తేరుకొనేసరికి డ్రయివరు దిగి వచ్చాడు. ఇద్దరూ కలిసి మీరమ్మను కొద్ది దూరంలో రోడ్డు ప్రక్కన పడుకో బెట్టారు.

"రా... రా... తెల్లారేటట్టుంది. ఎల్దాం" డ్రయివరు చీకట్లో ముందుకు కదిలాడు. కాని క్లీనరు ఆగిపోయాడు. మీరమ్మ చచ్చి పోయిందా లేక బ్రతికే వుందా అనేది వాడి అనుమానం. గొంతులో ఏదో శబ్దం కదులుతున్నట్లు, ఏదో చెప్పడానికి చెయ్యి లేస్తున్నట్లుగా అనిపించింది.

క్రిందికి వంగి నోటి దగ్గర చెవి పెట్టాడు. 'దా... దాహం' అంటూ జీరగా వినిపిస్తోంది. ఇక నిలువలేకపోయాడు. జేబులో ఉన్న టార్చి తీసి లైటు వేసాడు. దూరంగా రోడ్డు ప్రక్కన గుంటలో వర్షం నీళ్ళు మెరుస్తూ కనిపించాయి. పరుగెత్తుకు వెళ్ళి దోసిలిలోకి తీసు కొన్నాడు.

ఇంతలో లారీ స్టార్టు చేసిన శబ్దం. స్టీరింగు దగ్గర్నుంచి లారీ డ్రయివర్ తల నిక్కబెట్టి "ఒరే రంగా... నా నెల్తుండా. ఇక నీ ఖర్మ" అన్నాడు. క్లీనరుకు వృత్తి ధర్మం గుర్తుకొచ్చింది. దోసిట్లో నీళ్ళు నెమ్మ దిగా మీరమ్మ నోట్లోపోసి 'ఇక ఫరవాలేదు బతుకుద్ది' అనుకొంటూ పరు

గెత్తి, పరుగెత్తి స్పీడందుకోబోతున్న లారీని అతి కష్టం మీద జెక్కి పట్టుకుని పైకెక్కాడు.

వదిలితే ఎగిరిపోతాయన్నట్లు మీరమ్మ ఎడమ చేతిలో చిల్లర నోట్లు బిగిసి పట్టుకొని ఉంది అప్పటి నుండి. తన వృత్తి ధర్మం తాను సక్రమంగా నెరవేర్చినందుకు తృప్తిగా వుంది. మనసులోనే క్లీనరుకు కృతజ్ఞత చెప్పుకొని గుటక మింగింది మీరమ్మ అంతే ఆ నీళ్ళు గొంతుకడ్డం పడి ఉక్కిరిబిక్కిరై ఆమె ప్రాణం గాలిలో కలిసిపోయింది. బిగిసిపోయిన ఆమె చేతిలోని రూపాయి కాగితాలు ఉచ్చులో పడ్డ పక్షులు రెక్కలాడించినట్లు గాలికి రెప రెపా కొట్టుకుంటున్నాయి.